క్లుప్తంగా

విద్యా మండలి సదస్సులో ఏయూ అధికారులు



సదస్సులో పాల్గొన్న వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఉన్నత విద్యా మండలి ఉన్నతాధికారులు గురువారం వర్చువల్ విధానంలో నిర్వహించిన సదస్సులో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు. మండలి ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉప కులపతులతో ఈ సమావేశంలో ప్రసంగించారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర 2047 అంశం దిశగా చర్చించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



స్థానికులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిర ఆవరణలో ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు స్థానికులకు బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, ఆస్పత్రి వైద్య సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



నవీన్, నానిలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం: కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో పర్యావరణం ప్రకృతి అంశంపై జరిగిన క్విజ్ పోటీల్లో డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల థర్డ్ ఇయర్ బీఎస్సీ విద్యార్థులు ఎస్.నవీన్, ఎం.నాని తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు ఘనంగా సత్కరించి, అభినందించారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా క్విజ్ పోటీల్లో 12 జట్లు ఫైనల్స్‌కు చేరాయన్నారు. తమ కళాశాల విద్యార్థులు పోటీ పడి తృతీయ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయ, పద్మావతి, స్వామినాయుడు, శ్రావణ్‌కుమార్, రవిబాబు పాల్గొన్నారు.

నేడు 'కార్తీక మహాదీపం' ప్రత్యక్ష ప్రసారం

ఏయూక్యాంపస్: పవిత్ర కార్తీక మహాదీపం కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని శ్రీ మందిర్ అందిస్తోందని సంస్థ ప్రతినిధి ప్రశాంత్ సచన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అరుణాచలంలో జరిగే కార్తీక మహాదీపం, శివపార్వతీ కల్యాణం, మహారుద్ర హోమం కార్యక్రమాలను వర్చువల్‌గా భక్తులు వీక్షించే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. అగ్నిలింగంగా ప్రసిద్ధిగాంచిన ఈ క్షేత్రంలో జరిగే మహాదీపం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. దైవిక కాంతికి ప్రతీకగా నిలిచే కార్తీక మహాదీపం దక్షిణ భారతదేశం అంతటా వేడుకగా జరుపుతారన్నారు. పరమశివుడి ప్రతిరూపంగా ఈ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించాలని ఆయన కోరారు.

కళావిహీనం..!

అధ్వానంగా జీవీఎంసీ ఎలిఫెంట్ పార్క్

- వెత్తాచెదారం, మద్యం సీసాలతో నిండిన పరిసరాలు
- వెలగని విద్యుత్ దీపాలతో అంధకారం
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- తీర్చిదిద్దాలని స్థానికులు, సందర్శకుల విజ్ఞప్తి



ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని జీవీఎంసీ ఎలిఫెంట్ పార్క్



విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి పూట పార్కులో అంధకారం



అపరిశుభ్రంగా పార్కు లోపలి పరిసరాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఎలిఫెంట్ పార్క్ కళావిహీనంగా మారింది. చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు వినియోగించుకునేందుకు అనువుగా దశాబ్దాల కిందట ఈ పార్కును జీవీఎంసీ నిర్మించింది. నిర్వహణ లేమి కారణంగా స్థానికులు, సందర్శకులకు పార్కు అందుబాటులోకి రాకపోగా రోజురోజుకూ అధ్వానంగా తయారవుతోంది. పార్కులో ఎక్కడ చూసినా చిందరవందరగా ఉన్న పరిసరాలు, అపరిశుభ్రత కనిపిస్తున్నాయి. దీనిలో నడక మార్గం, క్రీడా సముదాయాలు ఉన్నప్పటికీ అవి సందర్శకులకు అక్కరకు రావడం లేదు. పారిశుధ్య లోపం, వెలగని విద్యుత్ దీపాల కారణంగా పార్కును వినియోగించుకునేందుకు స్థానికులు వెనుకడుగేస్తున్నారు. మహిళలు, పిల్లలు సేదతీరే పరిస్థితి లేదని చెబుతున్నారు. పార్కు నిర్మాణానికి రూ.లక్షలు వృథా మినహా ఒరిగిందేమి లేదంటూ పలువురు కాలనీ వాసులు విమర్శిస్తున్నారు.

పార్కు చుట్టూ చెత్తాచెదారం..

పార్కు చుట్టూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న పలువురు వారి షాపుల్లోని చెత్తను పార్కులో పడేస్తున్నారు. దీంతో పార్కు పరిసరాలు మరింత అధ్వానంగా మారుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది రోజు వారి క్లీనింగ్ చేయకపోవడంతో పార్కు చుట్టూ ఉన్న నడక మార్గం చెత్తతో నిండిపోతోంది. జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కును పూర్తి స్థాయిలో సందర్శకుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని, పార్కులో పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలని, విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని, రోజువారి పారిశుధ్య నిర్వహణ బాధ్యతను తీసుకోవాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డా..



పార్కులో మందుబాబులు తాగి వదిలేసిన మద్యం సీసాలు

వినియోగంలోని ఎలిఫెంట్ పార్కు ప్రస్తుతం మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కు నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడం, పరిసరాల అపరిశుభ్రత, వెలగని విద్యుత్ లైట్లతో అంధకారం కారణంగా ఈ పరిస్థితి దాపురించింది. పార్కులో ఎక్కడ చూసినా మద్యం సీసాలు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. రాత్రి పూట చీకటి నెలకొనడంతో ఆకతాయిలు, మందుబాబులు పార్కును అడ్డాగా మార్చుకొని మద్యం తాగున్నారు. గుంపులు గుంపులుగా చేరి భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.

ఏయూను సందర్శించిన అమెరికన్ ఆచార్యులు



టెక్సాస్ ఏ-ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు మొక్క బహూకరిస్తున్న ఏయూ వీసీ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని టెక్సాస్ ఏ-ఎం యూనివర్సిటీ ఆచార్యులు గురువారం సందర్శించారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ విభాగం డీన్ టింగ్‌లు, పబ్లిక్ హెల్త్ విభాగం ప్రొఫెసర్ విజయ్ గొల్లా ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్తంగా పనిచేసే అంశం దిశగా చర్చించారు. సంయుక్తంగా కోర్సుల నిర్వహణ పరిశోధనా రంగంలో కలిసి పని చేయడం, తదితర అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. కంప్యూటర్ సైన్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఆటిజంకు సంబంధించిన కోర్సుల నిర్వహించడానికి వీరు ఆసక్తి వ్యక్తం చేశారు.

14, 15 తేదీల్లో ఘంటసాల గానోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14, 15 తేదీల్లో ఘంటసాల గానోత్సవాలు నిర్వహించనున్నట్లు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను గురువారం శివాజీపాలెంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించామన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 14, 15 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు ఘంటసాల సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. 14న ఎమ్మెల్యే వంశీకృష్ణ, సినీ నిర్మాత, ఉపకార్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు, సినీ హీరో ఉపేంద్రబాబు, 15న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, హైకోర్టు న్యాయవాది ఎస్.కె. మహంతి ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. సోమేశ్ సంగీత నిర్వహణలో జరిగే విభావరిలో గాయకులు ఘంటసాల గీతాలు ఆలపిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరుమలరావు కోరారు. కార్యక్రమంలో కళారంగ ప్రముఖులు జి.త్యాగరాజన్, వీరేంద్ర యాదవ్, పిన్నింటి ఆదిమూర్తి పాల్గొన్నారు.

ఇసుక విక్రయాలు ప్రారంభం



ముడసర్లోవ యార్డులో ఇసుక

ఆరిలోవ: ముడసర్లోవ ఇసుక యార్డులో గురువారం ఇసుక విక్రయాలు ప్రారంభమయ్యాయి. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక నీటి సోలార్ ప్లాంట్ ఎదురుగా జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలంలో ఈ నెల 9న యార్డు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి శ్రీకాకుళం జిల్లాలోని రీచ్‌ల నుంచి పెద్ద లారీలతో ఇక్కడికి ఇసుక తీసుకొచ్చి స్టాక్ చేశారు. గురువారం నాటికి ఇక్కడ 1,600 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండగా.. దానిలో 10 మెట్రిక్ టన్నుల మాత్రమే మొదటిరోజు విక్రయాలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. అధికారులు ఎలాంటి ముందస్తు ప్రచారం ఇవ్వకుండా ఇక్కడ ఇసుక యార్డు ఆకస్మికంగా ఏర్పాటు చేయడంతో వినియోగదారులెవ్వరికీ సమాచారం లేదు. దీంతో ఇక్కడ యార్డు ఉందన్న విషయం ఎక్కువ మందికి తెలియకపోవడంతో వినియోగదారులు ఇసుక కోసం అరకొరగా వెళ్తున్నారు.

12వ వార్డులో సోలార్ లైట్ల ఏర్పాటు



నెహ్రూనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డులో పలు చోట్ల సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులకు గురువారం నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.20 లక్షల జీవీఎంసీ నిధులతో అవసరమైన చోట్ల సోలార్ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొండవాలు నివాసాల సౌలభ్యం కోసం నెహ్రూనగర్ కొండ అంచున, పెదగదిలి, సాలిపేట ప్రాంతాల కొండవాలులోను 20 సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నమన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ విద్యుత్ విభాగం ఏఈ పవన్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు మోహన్, సంతోష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురం శ్మశానవాటిక పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



పరిశుభ్రం చేసిన శ్మశానవాటిక

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం శ్మశానవాటిక ఎట్టకేలకు పరిశుభ్రమైంది. పిచ్చి మొక్కలతో నిండి అస్తవ్యస్తంగా ఉండే దీని పరిస్థితి ఇప్పుడు మారింది. శ్రీకృష్ణాపురం తోపాటు విశాఖ కేంద్ర కారాగారం క్వార్టర్స్‌లో ఉండే ఉద్యోగులు ఈ శ్మశానవాటికను వినియోగిస్తుంటారు. ఇది కొన్నాళ్ల నుంచి దట్టమైన పిచ్చి మొక్కలతో నిండిపోయింది. శ్మశానవాటిక లోపల ఫుట్‌పాత్, రోడ్డు సైతం మొక్కలు, ముళ్ల తుప్పలతో నిండిపోవడంతో దారిలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై 'పిచ్చి మొక్కలతో నిండిన శ్మశానవాటిక' అనే శీర్షికన గత నెలలో 'సాక్షి'లో వెలువడిన కథనానికి పారిశుధ్య విభాగం అధికారులు స్పందించారు. ఇటీవల ఈ శ్మశానవాటికలో రోడ్డుకు ఇరుపక్కలా మొక్కలు, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు. పారిశుధ్య సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6, సెక్టార్-2 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బి.సింహాచలంనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అంజయ్య నగర్, మెడికవర్ హాస్పిటల్ ఏరియా, రాజీవ్ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆహార ప్రయోగశాల సందర్శన



ఆహార ప్రయోగశాల ఉద్యోగులతో మాట్లాడుతున్న రవీంద్ర

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్ ఈఎస్‌టీ ఆస్పత్రి ఆవరణలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలను గురువారం బీజేపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రయోగశాలను గత ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. సిబ్బందితో మాట్లాడి అక్కడ పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ ప్రయోగశాలలో సిబ్బంది నియామకం జరిగినప్పటికీ ఆహార పరీక్షలు ప్రారంభం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రయోగశాలకు అవసరమైన పరికరాలు, రసాయనాలను అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను త్వరలో కలిసి ఇతర సిబ్బంది నియామకం, అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

కళతప్పిన ఐఎన్ఎస్ కల్వరి







- పట్టించుకునే వారు లేక అధ్వాన స్థితి
- మందుబాబులకు అడ్డాగా మారిన పరిసరాలు



దేశానికి గర్వకారణంగా నిలిచిన జలాంతర్గామి ఐఎన్ఎస్ కల్వరి కళతప్పింది. భారత్ నావికాదళంలో చేరిన తొలి జలాంతర్గామి ఇది. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన కల్వరిలోని ఒక భాగాన్ని విశాఖ సాగర తీరంలో మధుర జ్ఞాపకంగా ఉంచారు. ప్రస్తుతం దీనిని పట్టించుకునే వారు కరువయ్యారు. దీని నిర్వహణను గాలికొదిలేయడంతో కల్వరి లోపల పలు చోట్ల తుప్పు పడుతోంది. దీని పరిసరాలు సైతం మందుబాబులకు అడ్డాగా మారిపోతున్నాయి. సరైన విద్యుత్ దీపాల సదుపాయం లేకపోవడంతో రాత్రి వేళల్లో ఐఎన్ఎస్ కల్వరి వెనుక భాగంలో మందుబాబులు చేరిపోతున్నారు. దీంతో ఇక్కడ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. కల్వరి వెనుక భాగాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చేసి అనేక వ్యర్థాలను పారబోస్తున్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులు చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాంతాన్ని పరిరక్షించడం, తగినంత భద్రత కల్పించడం ఎంతో అవసరం. ఐఎన్ఎస్ కల్వరికి పెయింటింగ్ వేసి పరిరక్షించే దిశగా చర్యలు చేపట్టాలని నగర వాసులు, సందర్శకులు కోరుతున్నారు.

– ఏయూక్యాంపస్

అత్యుత్తమ నైపుణ్యాలతోనే అభ్యున్నతి



సమావేశంలో పాల్గొన్న ఆచార్యులు, నిపుణులు

ఏయూక్యాంపస్: అత్యుత్తమ నైపుణ్యాలతోనే వ్యక్తి అభ్యున్నతి సాధ్యపడుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో గురువారం ఐఐఎం సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంస్థ డీన్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విద్యలో వస్తున్న మార్పులు, అవకాశాలు, సవాళ్లపై నగరానికి చెందిన వివిధ రంగాల నిపుణులు ప్రసంగించారు. వ్యాపార అవకాశాలు, విస్తరణ, సవాళ్లు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో డైరెక్టర్ దీపిక దాస్, ఐఎస్‌బీ పూర్వ డీన్ ఆచార్య ఎం.ఆర్.రావు, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ డాక్టర్ అమరల్ కరోల్, ఐఐఎం బెంగళూర్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ కె.ఆర్.ఎస్.మూర్తి, టిస్ ఫ్యాకల్టీ ఆచార్య వీరేంద్ర శుక్ల, ఐఐఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సూర్యతేజ, డాక్టర్ విజయ రవీంద్ర, దివ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో రేకుల షెడ్ తొలగింపు



గ్రీన్‌బెల్ట్‌లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించిన రేకుల షెడ్

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దారపాలెం వద్ద గ్రీన్‌బెల్ట్‌లో అక్రమంగా వెలసిన రేకుల షెడ్‌ను గురువారం జోన్-2 టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఇక్కడ బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఇటీవల రేకుల షెడ్ వేశాడు. దీని కోసం బోర్ కూడా గ్రీన్‌బెల్ట్ లోనే తీయించేశాడు. దీనిపై స్థానికులు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అధికారులు స్పందించి రేకుల షెడ్‌ను తొలగించారు. ఇక్కడ రేకుల షెడ్ ముందు భాగంలో గోడను మాత్రమే తొలగించి, గ్రీన్‌బెల్ట్‌లో తీయించిన బోర్‌ను సీజ్ చేయకుండా తూతూమంత్రంగా చర్యలు చేపట్టారని స్థానికులు అధికారులపై ఆరోపణలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇదే వార్డులోని రామకృష్ణాపురం పందుల ఫారంలో అక్రమంగా రేకులు షెడ్లు నిర్మిస్తున్నారని ఫిర్యాదులు అందినట్లు సిబ్బంది తెలిపారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్త ఓటర్ల నమోదు, సవరణలకు దరఖాస్తు చేసుకోండి



జోన్-3 కమిషనర్ శివప్రసాద్

మద్దిలపాలెం: తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో 18 ఏళ్ల వయసు నిండిన వారు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని జీవీఎంసీ జోన్-3 కమిషనర్ కె.శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గ పరిధిలోని సచివాలయాల్లో ఈ నెల 24వ తేదీ లోగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సచివాలయంలో దరఖాస్తు నింపి, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, ఫొటో జత చేసి అందజేయాలన్నారు. ఓటరు కార్డులో చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం కూడా దరకాస్తు చేసుకోవాలని సూచించారు. వేరే నియోజకవర్గం నుంచి ఈ నియోజకవర్గానికి నివాసం మారిన వారు ఓటర్ కార్డులో చిరునామా మార్పు కోసం గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన వారి ఇంటికి బీఎల్‌వోలు వెళ్లి విచారణ చేశాక ఓటర్ కార్డులు జనరేట్ అవుతాయని తెలిపారు. అనంతరం నెట్ సెంటర్‌లో కార్డు ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది చెప్పారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్సీ కోరారు.